

# ప్రజాజ్యోతి

## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 9 | ఏప్రిల్ | 2024 | పేజీలు : 6


## గవర్నర్‌కు రాజపత్రం అందజేత

*భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి*

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ తెలంగాణ గవర్నర్ సిపి రాధాకృష్ణన్ కు సోమవారం దేవస్థానం ఈవో రాజపత్రం అందజేశారు. ముందుగా దేవస్థానం అర్చక బృందం ఆయనకు వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదం, జ్ఞాపికలను ఇచ్చారు. అనంతరం ఈవో ఎల్.రమాదేవి బ్రహ్మోత్సవాల రాజపత్రం అందజేశారు. పట్టాభిషేకంకు హాజరుకావాలని కోరారు.








● వివరాలు 4 లో

### త్రిముఖ పోటీలో...

# బలరాముడి విజయం తథ్యమా..!

◆ దివంగత నేత వైయస్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి ఎంట్రీ ◆ సాధారణ కానిస్టేబుల్ నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగిన నేపథ్యం ◆ 2009లో పార్లమెంటరీ ఎలక్షన్లో ఎంపీ సీట్ దక్కించుకున్న ఆ నేత ◆ గెలిచిన మొదటి సారే అధిష్టానం ఆశీస్సులతో కేంద్ర మంత్రిగా నియామకం ◆ తెలంగాణ బిల్లు పార్లమెంటులో పాస్ అవటం కోసం ముఖ్య భూమిక పోషించిన వారిలో తాను ఒకరు



**వరుస ఓటములతో కుంగిపోయిన ఆ నేతకి తన అనుకున్న వారందరూ అప్పటికే హ్యాండ్ ఇచ్చేసారట.** ఇంకా ఆ నేతకి రాజకీయ భవిష్యత్తు ఉండదని, తనతో తమ ప్రయాణం కొనసాగటం వలన ఉపయోగం ఉండదని, ఆపద సమయంలో అండగా నిలబడాల్సిన వారే ఆ నేతని ఒంటరి చేశారట. **ఇదిలా ఉండగా 2024 పార్లమెంటు ఎన్నికలలో అసలు సీటు వస్తుందా? రాదా? అనే సందిగ్ధత.** అయినప్పటికీ ఢిల్లీలో ఉన్న అధిష్టానం ఆశీస్సులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మరొకసారి మానుకోట అభ్యర్థి బరిలో నిలిచిన ఆ నేతకి అనూహ్యంగా సీటు దక్కటమే కాకుండా, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆ నేత ఎంపీగా పోటీ చేస్తున్న మానుకోట సీటు **"వారు వన్ సైడే"** అని అభిప్రాయపడుతున్న రాజకీయ విశ్లేషకులు.

■ భద్రాచలం, ప్రజాజ్యోతి

## 25 కేజీల గంజాయి పట్టివేత

*భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి*

భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, తమ లగేజ్ బ్యాగ్ లో 25 కేజీల గంజాయి లభ్యమైందని, పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు 7 లక్షల 50 వేల వరకు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఆంధ్ర ప్రాంతం నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్ గంజాయి తరలిస్తున్నట్లు నిందితులు వెల్లడించినట్లు పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు.





## గుప్త నిధుల తవ్వకాలలో

# 18 మంది ముఠా సభ్యులు..?

### జేసీబీతో తవ్వేందుకు పన్నాగం...!

### బాధ్యులపై అధికారులు చర్యలు తీసుకోనేనా..!

*ఇల్లందు, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:*

పెట్టేవాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్నా కడుపునిండా పెడతాననే నానుడి మాట ఇల్లందు మండలంలోని కొమరారం గ్రామంలోని ఓ మామిడి తోటలో జరిగిన గుప్తనిధుల తవ్వకాల వ్యవహారాన్ని బట్టి చూస్తే నిజమనేది తెలుస్తుంది. గత నాలుగేళ్లుగా సుమారుగా 18 మంది ముఠా సభ్యులుగా ఏర్పడి గుప్త నిధుల తవ్వకాలకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గ్రామస్తులందరూ ఏకతాటిపై ఉండడంతో చేసే గత్యంతరం లేక

మిగతా 2 లో..

# తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తవద్దు

### ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలి..

### ఆర్డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా..

*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి :*

వేసవిలో తాగునీటికీ ప్రజలు ఇబ్బంది పడొద్దని, పల్లెలు పట్టణాల్లో నీటి సరఫరాకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఆర్డబ్ల్యూఎస్ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తో కలిసి అశ్వాపురం మండలం, కుమ్మరిగూడెం మిషన్ భగీరథ ఇంటెక్ వెల్ సందర్శించారు. గోదావరి నీటిని నిల్వను పరిశీలించారు. ఇంటెక్ వెల్ నుంచి ఎంత నీటి సరఫరా జరుగుతుంది, మోటార్ల పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రథం గుట్ట 40 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనితీరును పరిశీలించారు. అనంతరం కుమ్మరిగూడెం ఐసోలేటెడ్ హ్యాబిటేషన్ సెంటర్లో నీటి సరఫరాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ గిరిజనులతో తాగునీరు అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ను పరిశీలించారు. రోజుకు ఎన్నిసార్లు ట్యాంకు

మిగతా 2 లో..



# గుప్తనిధుల తవ్వకాలలో 18 మంది ముఠా సభ్యులు..?

(మొదటి పేజీ తరువాయి)



అధికారులు వారిని విచారించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. జెసిబి సహాయంతో గుప్త నిధులను తవ్వేందుకు పన్నాగం సిద్ధం చేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. బహిరంగంగా ఓ మామిడి తోటలో గుప్తనిధుల కోసం జంతువును బలి ఇవ్వడంతో ఆ ప్రాంత ప్రజలు సైతం భయాందోళనకు గురవుతున్నారనేది వాస్తవం. అసలు గుప్త నిధుల తవ్వకాల విషయంలో ఘటనా స్థలంలో దొరికిన వారిని బైండోవర్ చేయడంపై గ్రామస్తులందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా గుప్తనిధుల తవ్వకాల వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన వారందరిని రక్షించేందుకే బైండోవర్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని గ్రామస్తులకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# నేటి నుంచి భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు

## ఉగాది రోజు నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు

## సర్వం సిద్ధం చేసిన దేవస్థానం అధికారులు



భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి

ఉగాది రోజున మంగళవారం భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. మంగళవారం నుంచి ఈ నెల 23 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఉదయం అంతరాలయంలోని ధ్రువమూర్తుల వద్ద ఉత్సవాలకు అనుజ్ఞ తీసుకొని ధ్వజారోహణం చేయనున్నారు. వేడుకల ప్రారంభానికి ముందుగా విశ్వక్సేన ఆరాధన, కర్మణ పుణ్యాహవాచన, రుత్విగ్వరణం, రక్షాబంధనం, స్నపన తిరుమంజనం, వాస్తు హెూమం, ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఉగాది ప్రసాద వితరణ, సాయంత్రం దర్బార్ సేవ తర్వాత నూతన పంచాంగ శ్రవణం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నారు. అలాగే కల్పవృక్ష వాహనంపై తాత గుడి సెంటర్ వరకు స్వామివారికి తిరువీధి సేవ నిర్వహించనున్నారు.

### బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి : దేవస్థానం ఈవో రమాదేవి

శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 16 సాయంత్రం నేత్రపర్వంగా ఎదుర్కోలు ఉత్సవం, 17న సీతారాముల కల్యాణం, 18న మహా పట్టాభిషేకం నిర్వహించనున్నాం. మిథిలా ప్రాంగణంలో జరిగే వేడుకల కోసం కల్యాణ మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రతి భక్తునికి స్వామివారి తలంబ్రాలు అందేలా ఈసారి 60 తలంబ్రాల కౌంటర్లు, స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని భక్తులు కొనుగోలు చేసేందుకు 19 కౌంటర్లను ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యం కోసం 2.50 లక్షల లడ్డూలు, 5 లక్షల తలంబ్రాల ప్యాకెట్లను సిద్ధం చేశాం. ఆర్టీసీ బస్సుల్లో కూడా స్వామివారి తలంబ్రాలను భక్తులకు అందజేస్తాం. ఆర్టీసీ కార్గో, తపాలా శాఖ ద్వారా కూడా భక్తులకు తలంబ్రాలను ఇంటి వద్దకే అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసిన వారికి ఈ నెల 17 ఉదయం 6 గంటల వరకు ఒరిజినల్ టికెట్లను అందజేస్తాం. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఎదుర్కోలు ఉత్సవానికి రాష్ట్ర మంత్రులు, శ్రీరామ నవమికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తారని, కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల కమిషనర్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకొచ్చే అవకాశం ఉంది.

# తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తవద్దు

(మొదటి పేజీ తరువాయి)

పంపిస్తున్నారని అధికారులను అడగగా 5000 లీటర్ల కెపాసిటీ ఉన్న ట్యాంక్ ను రోజుకు రెండుసార్లు సోలార్ పంపు ద్వారా నింపుతున్నట్టు అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన సోలార్ పంపు సమస్య తలెత్తినట్లయితే నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని ముందస్తుగా కరెంటు మోటార్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తగూడెం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలసి మిషన్ భగీరథ, మున్సిపల్, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు జిల్లాలో ఉన్న నీటి లభ్యత,నీటి సరఫరా, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా పై అధికారులు పక్కా ప్రణాళికలతో సిద్ధం కావాలన్నారు. రహదారి మార్గం లేని హ్యాబిటేషన్లలో డబ్బాల ద్వారా నీటి సరఫరా చేయు నూతన విధానాన్ని ప్రవేశపెట్టిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ను అభినందించారు. జిల్లాలో తాగునీటిపై తీసుకున్న ప్రణాళిక, కార్యచరణ అభినందనీయం అని తెలిపారు. జిల్లాలో నీటి లభ్యత ఉన్నదని దానిని ప్రణాళిక బద్ధంగా ఉపయోగించి, తాగు నీటికి సమస్యలు తలుత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారం లేదని తెలిపారు. ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల మరియు పంచాయతీ స్పెషల్ అధికారు వారి పరిధిలో త్రాగునీడి సమస్యలు నీటి లభ్యత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అధికారులు క్లోరినేషన్ టెస్టులు ఎన్నిసార్లు చేస్తున్నారని దానికి సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి డిమాండ్ పెరుగుతుందని సప్లై తగ్గుతుందని దానికి అనుగుణంగా ఖచ్చితమైన ప్రణాళికల ద్వారా నీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు సత్వరంగా స్పందించి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండల మరియు పంచాయతీ పరిధిలో నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. హ్యాండ్, పంపులు, బోర్లు పైప్లైన్ మరమ్మత్తులు సత్వరం పూర్తి చేయాలని తెలిపారు. తాగునీటి సరఫరా పై వస్తున్న వ్యతిరేక వార్తలపై వెంటనే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లా అధికారులతో తాగునీరు మరియు ఎస్డిఎఫ్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని అన్ని మండలాలు, పంచాయతీలో ఎస్డిఎఫ్ పనుల పురోగతిపై వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పురోగతిపై అసహనం వ్యక్తం చేశారు. అన్ని పనులను వారం లోగా పూర్తి చేసి సంబంధిత పనుల ఫోటోలను నివేదిక రూపంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు. మండల మరియు పంచాయతీ ప్రత్యేక అధికారులు అందరూ ప్రతిరోజు తమ పరిధిలోని నీటి సరఫరా కేంద్రాలను తనిఖీ చేయాలని, క్లోరినేషన్ ప్రక్రియ పరిశీలించి రిజిస్టర్లో సంతకం చేయాలని ఆదేశించారు. నీటి వనరులు లభ్యత లేని గ్రామాలలో రెండు రోజుల్లో బోర్లు వేయించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. మండల పంచాయతీ స్థాయిలో అధికారులందరూ నిరంతరం పర్యవేక్షణతో తాగునీటి సమస్యలను తలెత్తకుండా నిరంతరాయంగా నీటి సరఫ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, మిషన్ భగీరథ ఈ ఎన్ సి కృపాకర్ రెడ్డి, మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్సీ సదాశివ కుమార్, డిఆర్డిఓ విద్యాచందన, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, జడ్పీ సీఈవో ప్రసూన రాణి,భూగర్భ జల శాఖ అధికారి బాలు, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, మిషన్ భగీరథ డీఈలు, ఏ ఈ లు, పబ్లిక్ హెల్త్, డిఈలు ఏ ఈ లు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, మరియుఅధికారులు తదితరులు పాల్గొన్నారు.









# విధి నిర్వహణలో ఆశ్రమ పాఠశాల ఏఎన్ఎం కు ప్రమాదం

## పట్టించుకోని అధికారులు

దుమ్ముగూడెం, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి

విధులు నిర్వహిస్తున్న క్రమం లో ప్రమాదానికి గురైన ఏఎన్ఎం పూర్తిగా కోలు కునే అంతవరకు ఐటీడీఏ అధికారులే బాధ్యత వహించాలి: ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం డివిజన్ నాయకులు సోంది మల్లుదొర, రేసు ఆదినారయణ మూర్తి డిమాండ్ ప్రమాదానికి గురైన ఏఎన్ఎం ను ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు ఆదివారం పరామర్శించి విచారించగా, రామచంద్రుని పేట ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఏఎన్ఎం అదే పాఠశాలకు చెందిన ఒక విద్యార్థినికి వైద్యం చేయించడానికి ఐదో తారీఖున రాత్రి 7 గంటల సమయంలో అదే ఆశ్రమం పాఠశాలకు చెందిన వర్కర్ ద్విచక్ర వాహనంపై ములకుపాడు తీసుకు వెళుతూ ఉండగా, మారాయి గూడెం గ్రామ శివారు లో గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్ట డంతో ద్విచక్ర వాహనంలో వెనక కూర్చున్న ఏఎన్ఎం రేసు పార్వతికి తీవ్రమైన గాయాల య్యాయి అని, ఎడమ కాలు, కుడి చెయ్యి బొటన వేలు మెడ కింద, ఎద ఎముక లు విరిగాయి. ప్రమా దంలో స్పృహ తప్పి రోడ్డు పై పడి ఉన్న ఆమెను భీమ వరం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ముందు గా ములగపాడు తీసుకువెళ్లి ,ప్రథమ చికిత్స చేయించి భద్రాచలం ఓ ప్రైవేట్ హాస్పిటల్ కి తీసు కెళ్లారు. చికిత్స మొదలు పెట్టి ఎక్స్ రే తీయంచగా




ఎడమకాలు ,కుడి చెయ్యి బొట్టన వేలు, చెస్ట్ ఎముక విరిగాయని నిర్ధారణ జరిగింది. విరిగిన ఎము కలకు ఆపరేషన్ చేసి ప్లేట్లు వేశారు. సుమారుగా 60 వేల రూపాయలు ఇప్పటివరకు వైద్య ఖర్చులు అ- య్యాయి అని, విధి నిర్వహణ లో ఇంత పెద్ద ప్రమాదం జరిగి హాస్పిటల్ పాలయి ఉన్న ఏఎన్ఎం పార్వతిని రామచంద్రంపేట ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డెను గానీ, అధికారులు, ఏటీడీవో డిడిలు గానీ చికిత్స పొందుతున్న పార్వతిని కనీసం పరామర్శించడం గాని, ఆమె కు జరిగిన



ప్రమాదాని పై విచారణ గాని, విధి నిర్వహణలో జరిగిన ప్రమాదానికి బాధ్యత వహించడం గాని ఇంతవరకు చేయలేదు. కనీసం జరిగిన ప్రమాదం గురించి ఐటీడీఏ పీవో గారి దృష్టికి కూడా తీసుకు వెళ్లలేదు. విధి నిర్వహణలో ఏ ఎన్ ఎం తన బాధ్యత కర్తవ్యం గా ఆశ్రమ పాఠశాల విద్యార్థినికి బాగోలే దని రాత్రి సమయం అయిన లెక్కచేయకుండా ఏడు గంటల సమయంలో హాస్టల్ విద్యార్థిని బాగు కొరకు వైద్యం కొరకు వెళుతున్న క్రమంలో ఒక ఆదివాసి మహిళ ఉద్యోగి ప్రమాదానికి గురవుతే, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం చాలా బాధా కరం అని ఆవేదన పడ్డారు. ప్రస్తుతం ఏఎన్ఎం పార్వతి లేసి నిలబడలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. విధి నిర్వహణలో ఉండగా జరిగిన ఈ ప్రమాదానికి ఆ పాఠశాల, ఐటిడిఏ అధికారులు బాధ్యత వహించి వైద్యానికి అయిన ఖర్చులు ఇప్పించడంతోపాటు, పార్వతి కోలుకుని విధుల్లో చేరేంత వరకు ఆమెకు పూర్తిస్థాయిలో వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# బేస్ వర్క్ షాపులో వెల్లి విరిసిన మత సామరస్యం

- తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్





మణుగూరు రూరల్, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి :

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా బేస్ వర్క్ షాప్ లో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండుగ ఉపవాస దీక్షల నేపథ్యంలో సోమవారం నాడు మత సామరస్యం వెల్లి విరిసింది, ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుకై పండ్లు ప్యాకింగ్ అందజేసి తమ సోదర భావాన్ని హిందూ కార్మిక సోదరులు ప్రకటించుకోగా ప్రతిగా ముస్లిం కార్మిక సోదరులు తమకిష్టమైన సేమియా విందు హిందూ, క్రిస్టియన్ కార్మిక సోదరులకు ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పీకే ఓసి ప్రాజెక్టు అధికారి సింగరేణి అధికారుల సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథిగా పీకే ఓసి ప్రాజెక్ట్ శ్రీ జే వీరభద్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్ష మాసంలో హిందూ ముస్లిం సోదరులు పరస్పరం ఒకరు సేమ్యా విందు ఏర్పాటు చేస్తే మరొకరు ఇఫ్తార్ విందుకై పండ్లు ఏర్పాటుచేసి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారని బేస్ వర్క్ షాప్ కార్మికులను సూపర్వైజర్ లను అధికారులను ఆయన అభినందించారు, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ భాయ్ భాయ్ అని అందరం సింగరేణి తల్లి ఒడిలో సేద తీరుతున్న ఆ తల్లి బిడ్డలమేనని కుల మతాలకతీతంగా మనమందరం భారతీయులమని వారు కొనియాడారు ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటుపడాలని కోరారు. అనంతరం ఒకరినొకరు సింగరేణి నినాదం ఒకే కుటుంబం స్ఫూర్తితో సోదర భావంతో అలింగనం చేసుకున్నారు, మెయింటినెన్స్ సెక్షన్ ఉద్యోగి షేక్ అబ్దుల్ రవూఫ్ కార్యక్రమానికి సమన్వయ కర్తగా వ్యవహరించగా ఈ కార్యక్రమంలో పీకే ఓసి ప్రాజెక్ట్ ఇంజనీర్ జే వీరభద్రుడు, బేస్ వర్క్ షాప్ ఇన్ ఛార్జ్ దాసరి రాజశేఖర్,సీనియర్ పిఓ ఎండి మదార్ సాహెబ్, ఇస్లావత్ సతీష్ కుమార్, మల్లికార్జున్,గుర్తింపు సంఘం నాయ కులు వై రామ్ గోపాల్, ఏరియా ప్రాతినిధ్య సంఘం నాయకులు ఎండి షాబు ద్దీన్, కార్మికులు ఎండి ఇషాక్, తాజుద్దీన్, గౌస్, దీపక్ ,నరేష్ ,నారాయణ, శ్రావ ణ్ అన్ని సెక్షన్ల ఇంజనీర్లు మరియు బేస్ వర్క్ షాప్ లో భాగస్వామ్యమైన మెయిం టెనెన్స్ సెక్షన్, 60 టన్ మరియు 100 టన్నుల డంపర్ సెక్షన్స్ , డి సీ ఎలక్ట్రికల్ సెక్షన్, డోజర్ సెక్షన్ టైర్ సెక్షన్ ఉద్యోగ సోదరులందరూ పాల్గొన్నారు.

# ముత్యాల తలంబ్రాలు పోస్టర్లు ఆవిష్కరించిన డిపో మేనేజర్ స్వామి

మణుగూరు, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో ఆధ్వర్యంలో భద్రాచల సీతారాముల చంద్ర స్వామి వారి తలంబ్రాల పోస్టర్ను డిపో మేనేజర్ స్వామి సోమవారం డిపో ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న భద్రాచలంలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణం అనంతరం కళ్యాణ తలంబ్రాలు కావలసినవారు 151 రూపాయలు చెల్లించి ముందుగా బుక్ చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు మణుగూరు సురక్ష బస్టాండ్ లో గల కార్గో పాయింట్ను కానీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 9154298588 నెంబర్ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చున్నారు.



ఈ కార్యక్ర మంలో అసి స్టెంట్ మేనేజర్ కనకదుర్గ ట్రాఫిక్ సూపర్వైజర్ కె ఎమ్ రావు హెడ్ కానిస్టే బుల్ పి. వెంకటేశ్వర్లు డిఎమ్ఇ సైదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నీవు నేర్పిన విద్యయే కదా నీరజాక్షా

చర్ల, 8 ఏప్రిల్, ప్రజాజ్యోతి:



పార్టీ ఫిరాయింపుల గురించి బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం మాట్లా డటం సిగ్గుచేటని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా. చరణ్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం. వెంకట్రావు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయమై న్యాయపోరాటం చేస్తానని అంటున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గతంలో తాను చేసిందేమిటో గుర్తుకు తెచ్చు కోవాలని అన్నారు. 2014 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి అభివృద్ధి వంకతో గులాబీ గూటికి చేరిన రేగా కాంతారావు ఇప్పుడు డాక్టర్ తెల్లం. వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరితే రాద్ధాంతం చేయడం హాస్యాస్పదమని అన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు, రేగా కాంతారావుల తీరు చూస్తుంటే గురివింద సామెత గుర్తుకు వస్తున్నదన్నారు. ఆనాడు రేగా కాంతారావు పార్టీ మారితే తప్పు కానిది నేడు తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ లో చేరడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. తాను చేస్తే సంసారం మరొకరు చేస్తే వ్యభిచారం అన్న చందంగా వారు మాట్లాడుతున్నారని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బిఆర్ఎస్ పార్టీయేనని గుర్తు చేశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు చూస్తుంటే కారు ఖాళీ అవుతుందని బిఆర్ఎస్ నాయకత్వానికి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరికి నచ్చిన పార్టీలో వారు చేరవచ్చని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలి:అల్లాడి పాల్ రాజ్



భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి.

మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఏఎంసీ కాలనీ, భద్రాచలం లో జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ ప్రసంగిస్తూ ఈ రాష్ట్రంలో ఇంకా పేదరికం ఉంది అనడానికి 20 సంవత్సరాల నుంచి దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్న మైనార్టీ , ఎస్ సి సంఘాలే ఉదాహరణ. సాక్షాత్ కూలి పని చేసుకుంటూ, అద్దె ఇంట్లో ఉంటూ నెలకు 4000 , కరెంట్ బిల్లు 500/- చెల్లిస్తున్నవారు చాలా మంది నిరుపేదలు ఇంకా దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తూ చాలా ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వంలో ఇల్లు లేక నివసిస్తున్న ప్రజలకు ఈ ప్రభుత్వంలోనైనా రెండు సెంట్లు స్థలం ఇవ్వాలి, లేకపోతే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సామేలు, చీకటి దసింబాబు, బర్ల రామకృష్ణ, డేగల రాజు, మురికి శీను, బల్లెం ఉదయ్ కాంతు, శీను, నరేష్, కడిగేసి సాగరు, హుస్సేన్ ,శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# చలి వేంద్రాన్ని ప్రారంభించిన జడ్జి

ఇల్లందు, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:



ఇల్లందు బార్ అసోస యేషన్ ఆధ్వ ర్యంలో కోర్టు ఆవరణలో ఏర్పా టు చలివేంద్రాన్ని సోమ వారం ఇల్లందు ప్రిన్సి పాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి కోర్టుకు వచ్చే కక్షిదారుల దాహర్తి తీర్చడం కోసం మార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ చలివేంద్రాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్య రవికుమార్ నాయక్, జనరల్ సెక్రెటరీ సెక్రెటరీ కాంపెల్లి ఉమామహేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ కీర్తి కార్తిక్, ట్రెజరర్ సిహెచ్ నవీన్ కుమార్, సీనియర్ న్యాయవాదులు ఎన్. చెన్నకేశవరావు, మాజీ ప్రెసిడెంట్ మామిడి సత్య ప్రకాష్, జూనియర్ న్యాయవాదులు పి. ధనంజయరావు, ఎం. మురళీకృష్ణ, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# త్రిముఖ పోటీలో...
# బలరాముడి విజయం తథ్యమా..!



దివంగత నేత వైయస్ ఆశీస్సులతో రాజకీయాల్లోకి ఎంట్రీ

సాధారణ కానిస్టేబుల్ నుంచి కేంద్ర మంత్రిగా ఎదిగిన నేపథ్యం

2009లో పార్లమెంటరీ ఎలక్షన్లో ఎంపీ సీట్ దక్కించుకున్న ఆ నేత


గెలిచిన మొదటి సారే అధిష్ఠానం ఆశీస్సులతో కేంద్ర మంత్రిగా నియామకం


తెలంగాణ బిల్లు పార్లమెంటులో పాస్ అవటం కోసం ముఖ్య భూమిక పోషించిన వారిలో తాను ఒకరు

**తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అనూహ్యంగా రాష్ట్రంలో టిఆర్ఎస్ గాలి వీస్తున్న నేపథ్యంలో 2014లో, 2019లో వరుసగా ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలు అయినప్పటికీ అదే మానుకోట నియోజక వర్గం నుంచి 2019లో ఎమ్మెల్యేగా మరియొక అవకాశం ఇచ్చి పోటీలో దించిన అధిష్ఠానం. అప్పటికే నివురు గప్పిన గ్రూప్ రాజకీయాలు , వర్గపోరుతో ఎమ్మెల్యేగా కూడా ఓటమి పాలు. వరుస ఓటములతో కుంగిపోయిన ఆ నేతకి తన అనుకున్న వారందరూ అప్పటికే హ్యాండ్ ఇచ్చేసారట. ఇంకా ఆ నేతకి రాజకీయ భవిష్యత్తు ఉండదని, తనతో తమ ప్రయాణం కొనసాగటం వలన ఉపయోగం ఉండదని, ఆపద సమయంలో అండగా నిలబడాల్సిన వారే ఆ నేతని ఒంటరి చేశారట. ఇదిలా ఉండగా 2024 పార్లమెంటు ఎన్నికలలో అసలు సీటు వస్తుందా? రాదా? అనే సందిగ్ధత. అయినప్పటికీ ఢిల్లీలో ఉన్న అధిష్ఠానం ఆశీస్సులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మరొకసారి మానుకోట అభ్యర్థి బరిలో నిలిచిన ఆ నేతకి అనూహ్యంగా సీటు దక్కటమే కాకుండా, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆ నేత ఎంపీగా పోటీ చేస్తున్న మానుకోట సీటు "వారు వన్ సైడే" అని అభిప్రాయపడుతున్న రాజకీయ విశ్లేషకులు.**

■ భద్రాచలం, ప్రజాజ్యోతి







ఇకపోతే ఆరోజు తన వాటమికి ప్రధాన కారణమైన నాయకులే, ఈరోజు తన గెలుపు ఖాయమని, కేంద్రంలో అధికారం వస్తే మరల కేంద్ర మంత్రి అవటం పక్కా అని భావించి, మళ్లీ తన చెంతకు చేరుతున్నారా అంటే అవుననే చెప్పాలి .. తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల్లో నాలుగు స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ మొదటి విడతలో అభ్యర్థులను ప్రకటించింది. ఆ నాలుగింటిలో మహబూబాబాద్ ఒకటి ఉన్నది. ఇక్కడ నుండి మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ ను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించగా,అటు టిఆర్ఎస్ నుంచి మాలోతు కవిత ,ఇటు బిజెపి నుంచి సీతారాం నాయక్ లను ఆయా పార్టీలు అభ్యర్థులుగా ఇప్పటికే ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం వరస ఘటనలతో టిఆర్ఎస్ పార్టీకి రాష్ట్రమంతటా వ్యతిరేక పవనాలు వీస్తున్న నేపథ్యంలో సిట్టింగ్ ఎంపీగా ఉన్న మాలోతు కవితని సునాయాసంగా ఓడించి, మానుకోటలో కాంగ్రెస్ జెండా ఎగరవేయటం ఖాయం అని టాక్. బలరాం నాయక్ కి ప్రధాన ప్రత్యర్థిగా టిఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న మాలోత్ కవిత ఎంపీగా ఉన్నంతకాలం ఏ రోజు ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలని పట్టించుకున్న పాపాన పోలేదు అని, కనీసం ఎంపీ అయిన తర్వాత తమ గ్రామాలకు వచ్చింది కూడా లేదు అని ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతే ఉందట. మరొక అభ్యర్థి అయినా సీతారాం నాయక్ 2014 ఎన్నికల్లో ఎంపీగా గెలిచి, మానుకోట నియోజకవర్గ ప్రజలకు పెద్దగా చేసింది ఏమీ లేకపోవడం, అంతేకాకుండా బిజెపి పార్టీకి ఈ ప్రాంతంలో కనీస ఓటు బ్యాంకు లేకపోవడంతో సీతారాం నాయక్ పోటీని నామమాత్రంగానే భావిస్తున్న రాజకీయ పండితులు. దీనికి తోడు బలరాం నాయక్ కేంద్రమంత్రిగా ఉన్న కాలంలో చేసిన అనేక అభివృద్ధి పనులు, కేంద్రం నుంచి తీసుకొచ్చిన కొన్ని వేల కోట్ల నిధులతో పాటు ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకపోవడం బలరాం నాయక్ కి కలిసొచ్చే అంశాలుగా అభిప్రాయ పడుతున్న నియోజకవర్గం ప్రజానీకం. అంతేకాకుండా నియోజకవర్గం మొత్తం పరిచయం ఉన్న వ్యక్తిగా, ప్రతి ఒక్కరితో కలిసిపోయే తత్వం ఉన్న బలరాం నాయక్ గెలుపు నల్లేరుపై నడకే అని చర్చ. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ఇల్లెందు, డోర్నకల్. మహబూబాబాద్,భద్రాచలంలలో ఒక విడత సమావేశాలు నిర్వహించగా, నియోజకవర్గాల సమావేశాలకు పొంగులేటి హాజరయ్యారు. మంత్రి సీతక్క, బలరాం నాయక్ లు ములుగు నియోజక వర్గంలో పర్యటిం చారు. ఇప్పటికే నియోజక వర్గం వ్యాప్తంగా బలరాం నాయక్ చొచ్చుకొని వెళుతున్న నేపథ్యంలో ఇక్కడ బలరాం గెలుపు ఖాయంగా కనిపిస్తుంది. కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బంజారా కోటాలో మరోసారి కేంద్ర మంత్రి అయ్యే అవకాశం లేకపోలేదు అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇకపోతే ఎంపి అభ్యర్థిగా పోటీ చేసేందుకు మెహబాదుకు చెందిన డాక్టర్ శంకర్ నాయక్,రెడ్యానాయక్ మరియు పినపాక నియోజకవర్గం కి చెందిన చందా లింగయ్య దొర తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ, అధిష్టానంతో తత్సంబంధాలు కలిగిన బలరాం నాయక్ వైపై అధిష్టానం మొగ్గు చూపిందట. దీనికి తోడు అప్పట్లో సీనియర్లైన వీహెచ్ హనుమంతరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జగ్గారెడ్డి, బట్టి విక్రమార్క లాంటి నాయకులు పిసిసి అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేసినప్పటికీ, బలరాం నాయక్ రేవంత్ రెడ్డి వైపే ఉండి, ఆయనకు పిసిసి అధ్యక్ష పదవి వచ్చేటందుకు పూర్తిస్థాయిలో సహకరించాడనేది అప్పట్లో చర్చ నడిచింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డికి కొంతమంది బలరాం నాయక్ కి టికెట్ ఇస్తే ఓడిపోతాడని, ఈసారి చందా లింగయ్యకు గాని, డాక్టర్ శంకర్ నాయక్ గాని,రెడ్యానాయక్ గాని టికెట్ ఇస్తే ఖచ్చితంగా గెలుస్తారని పూర్తిస్థాయిలో లాబింగు చేసినప్పటికీ, మొదటి నుంచి తనకి అండగా ఉన్న బలరాం వైపై సీఎం రేవంత్ మొగ్గు చూపారట. అంతేకాకుండా బలరాం నాయక్ గెలుపు బాధ్యతని ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేము నరేందర్ రెడ్డి మరియు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భుజాలపై పెట్టాడట. మూడు లక్షల మెజారిటీ తగ్గకుండా బలరాం నాయక్ ని గెలిపించి తీసుకురావాలని అల్టిమేట్ కూడా జారీ చేశారట. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్న, పవనాలన్నీ కాంగ్రెస్ వైపే వీస్తున్నప్పటికీ సొంత పార్టీలోని కొంతమంది తనకు అనుకూలంగా పని చేస్తారా? లేదా? అని,బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కాంగ్రెస్ పార్టీలో చేరికతో మళ్లీ గ్రూపు రాజకీయాలకు తెరలేపి నమ్ముకున్న వారే గతాన్ని పునరావృతం చేసేటందుకు ఆజ్యం పోస్తారా అని గుబులు పడుతున్నారట పోరిక బలరాం నాయక్.

## జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు

### కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

*భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:*



జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగువారి పండుగలన్ని చాలా అద్భుతంగా ఉంటాయని, వాటిలో ఉగాది పండుగ ఎంతో గొప్ప పండుగని చెప్పారు. ఉగాది పండుగ రోజున తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు, కారంతో తయారు చేసిన పచ్చడిని ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారని చెప్పారు. ఉగాది పచ్చడిలాగే మనిషి జీవితంలో ఎదురయ్యే కష్టాలు, సుఖాలు, ఆనందాలు, బాధలన్నిటికీ పచ్చడి ప్రతీక అని చెప్పారు. ఉగాది పేరులోనే యుగ ఆది అనే అర్థం ఉందని, అనగా ఈ ఏడాది ప్రారంభమని చెప్పారు. తెలుగువారికి ఉగాది పండుగతోనే సంవత్సరం ప్రారంభం అవుతుందని, సంవత్సరం పొడుగునా ఎదురయ్యే మంచి, చెడులను, కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలనే సందేశాన్ని ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తుందని ఆమె చెప్పారు. ప్రజలు సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని, అభివృద్ధిలో మన జిల్లా రోల్ మోడల్ గా, ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు.

## ప్రజలకు క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

### ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

*భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి.*



ఆదివాసి గిరిజన మండలాలలోని గిరిజన గ్రామాలలోని ఇతర కార్యాలయాలలో గిరిజనులకు సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, గిరిజన సంక్షేమ ఆశ్రమ మరియు గిరిజన గురుకులంలో పనిచేయుచున్న హెడ్మాస్టర్లు, మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు తెలుగు సంవత్సరాది ఉగాది క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఉగాది పండుగ అందరి జీవితాల్లో వెలుగు నింపాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని, సుఖశాంతులు కలగాలని, ఉగాది రోజు షడ్ రుచులచే మిలితం చేసిన ఉగాది పచ్చడిని అందరూ సేవించి, ఎటువంటి వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని, ముఖ్యంగా గిరిజన విద్యార్థిని, విద్యార్థులు మీ యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకొని, గురువుల పట్ల భక్తి భావంతో ఉండి చక్కగా చదువుకొని మీ యొక్క తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పదవ తరగతిలో మంచి మార్కు లతో పాస్ అవ్వాలని దీవిస్తూ మరి ఒకసారి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# బొగ్గు లారీల దూకుడు..!

**అడ్డు అదుపు లేని వేగం**

**లైసెన్స్ లేని డ్రైవర్లు...**

**భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు..**

**పట్టించుకొని అధికారులు**





**టేకులపల్లి, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలోని కోయగూడెం ఓసీ బొగ్గు లారీలు వస్తున్నాయంటే గ్రామ ప్రజలు హడలెత్తిపోతున్నారు. లారీల దూకుడు రోజురోజుకు పెరిగిపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కోయగూడెం నుండి ఇల్లందు సి హెచ్ పి, కొత్తగూడెం బొగ్గును సరఫరా చేసే లారీల దూకుడుకు మామూలుగా లేదనే చెప్పొచ్చు. ఇల్లందు, కొత్తగూడెం బోగ్గు రవాణా చేసే లారీలను ద్విచక్ర వాహనాల మాదిరిగా నడుపుతున్నారు. కోయగూడెం ఓసి నుంచి ఇల్లందు సి ఎస్ పి, కొత్తగూడెం వెళ్లే లారీలు ట్రిప్పుల లెక్కన నడుస్తుండడంతో ఈ బండ్లను నడిపే డ్రైవర్లు వేగానికి అడ్డు అదుపు లేకుండా పోతుందనేది వాస్తవం. గత కొన్ని రోజుల క్రితం తెల్లవారు జామున మట్టి తోలుకం నడుస్తున్న ట్రాక్టర్ ను టిప్పర్ అతివేగం కారణంగా ఢీకొన్న ఘటనలు ఉన్నాయి. ట్రాక్టర్ డ్రైవర్ అదృష్టం బాగుండడంతో తృటిలో తప్పిన పెను ప్రమాదం తప్పిందని పలువురు పేర్కొంటున్నారు. కోయగూడెం ఓసి నుంచి మొదటి మూల మలుపు చాలా ప్రమాదాలకు నెలవుగా మారిందనేది వాస్తవం. బొగ్గు లారీల ద్వారా కింద పడే బొగ్గు పెళ్ళలు నుజ్జు నుజ్జుగా మారి విపరీతమైన దుమ్ము దూళిని రేపుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు అంతా సన్నని బొగ్గు చూర నింపడంతో ద్విచక్ర వాహనాలు పెద్దమ్మ తల్లి మూలమలుపు వద్ద జారి పడుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. లారీల పైన సరైన విధానంలో టర్పాలిన్లు కట్టడం లేదనేది కళ్లకు కనిపిస్తోంది. పైగా బొగ్గును కూడా లారీ బాడీకి సమాంతరంగా కాకుండా హెచ్చుగా పోయడం వల్ల మూలమలుపుల వద్ద ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 12 టైర్ టిప్పర్ కు 23 టన్నులు, 14 టైర్ టిప్పర్ కు 28 టన్నుల బొగ్గు లోడింగ్ రూల్ ఉన్నప్పటికి వాటిని బేఖాతర్ చేస్తూ లోడింగ్ కు అదనంగా 3 నుంచి 5 టన్నుల వరకు అధిక లోడింగ్ చేస్తున్నారని సమాచారం. కోయగూడెం ఓసీలో తిరుగుతున్న చాలా టిప్పర్లకు బ్రేకులు సరైన కండిషన్ లో లేని లారీలు చాలానే ఉన్నాయి. ఇక నాలుగు రోజుల క్రితం లైసెన్సు, అనుభవం లేని డ్రైవర్లు రోడ్లపై వెళ్తున్న కారును వెనకనుంచి ఢీకొనడం వల్ల కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పలు మార్లు పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ సింగరేణి అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులు పట్టించుకున్న దాఖలు లేవనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సింగరేణి అధికారులు, అధికారులు స్పందించి అధిక లోడుతో పాటు అతివేగంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు లైసెన్స్ లేకపోవడంపై తనిఖీలు నిర్వహించి సంబంధిత లారీ యజమానులపై చట్టపరమైన్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## ఫోక్సో కేసు నమోదు

**టేకులపల్లి, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** బంధువులకు చెందిన మైనర్ బాలికను లొంగ దీసుకోని గర్భవతిని చేసిన వ్యక్తిపై సోమవారం బోడు పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం టేకులపల్లి మండలంలోని చింతోనిచెలక గ్రామానికి చెందిన 15 ఏళ్ల మైనర్ బాలికను వరసకు బావ అయ్యే బర్లగూడెం గ్రామ పంచాయితీ జంగలపల్లి గ్రామానికి చెందిన బంధువుల అబ్బాయి (22) లొంగ తీసుకోని గర్భవతిని చేయడం జరిగిందన్నారు. ఈ సంఘటనలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



**పాల్వంచ, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** సినీ నటుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా పాల్వంచ మెగా ఫాన్స్ అధ్యక్షుడు ఖాసీం ఆధ్వర్యంలో సోమవారం పాల్వంచ మండల పరిధి లక్ష్మీదేవిపల్లి సాయిబాబా గుడిలో పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం యాచకులు అల్పాహారం కార్యక్రమం నిర్వహించి, స్థానిక వెంకటేశ్వర థియేటర్ నందు కేక్ కట్ చేసి మిఠాయి పంచారు. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడుతూ.. అల్లు అర్జున్ ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకొని నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండాలని మనస్పూర్తిగా ఆ దేవుని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్, స్వామి, మస్తాన్, భాష, శ్యామ్, షాహిద్, సోమ శేఖర్, అశ్విన్, వేణు, గనరాక్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి



**ములకలపల్లి, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** గుర్తుతెలియని వాహనం ఢీకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమ వారం మండలంలో చోటు చేసు కుంది. పోలీసులు మృతుడి కుటుం బ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకా రం మండంలోని చాపరాలపల్లి పంచాయతీ కుమ్మరిపాడు గ్రామానికి చెందిన పద్దం శివాజీ(27) ఓ ప్రవేటు స్కూల్ బస్సు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఆదివారం ఒడ్డురామ వరం గ్రామంలోని తన సోదరుడు అరుణ్ కూతురు అన్న ప్రాసన కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వెళ్ళి తిరిగి ఇంటికి వెళ్ళుతున్న క్రమంలో పూసుగూడెం, మాదారం గ్రామాల నడుమ ఈదుల వాగు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన శివాజీ ని స్థానిక పోలీసులు పాల్వంచ గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి బార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య స్వాతి పిర్యాదు మేరకు ఎస్ఐ రాజమౌళి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గుడుంబా తయారు చేస్తున్న నలుగురు బైండోవర్



**టేకులపల్లి, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** మండలంలోని సులానగర్, కొత్త తండా, 9వ మైల్ తండాలలో గుడుంబా తయారు చేస్తు, విక్రయాలు కొనసాగిస్తున్న వారిపై దాడులు చేసి నలుగురిని సోమవారం ఎక్సైజ్ పోలీసులు టేకులపల్లి తహసిల్దార్ నాగ భవాని ఎదుట బైండోవర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అచ్చారావు, ఎక్సైజ్ కానిస్టేబుల్ పాషా, తులసి మల్లికార్జున్, ఈసీ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా శ్రీకనకదుర్గ అమ్మవారి పొంగళ్ళ జాతర

**-ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్**



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి** బూర్గంపహాడ్ మండలం సారపాక గాంధీనగర్లో వేంచేసి ఉన్న శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ వారి దేవాలయంలో 4వ పొంగళ్ళ జాతర మహోత్సవాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరిగే ఈ పొంగళ్ళ జాతర మహోత్సవాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇతి బాధలు, ఎటువంటి వ్యాధి బాధలు పడకుండా పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి పొంగళ్ళు సమర్పిస్తారు. ఈ పొంగళ్ళ మహోత్సవంలో ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు వచ్చి అమ్మవారికి పొంగళ్ళు సమర్పిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఆలయ కమిటీ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా మంచినీటి సదుపాయం వంటి మౌళిక సదుపాయాలను సమకూర్చారు. ఈ నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయం వద్దకు చేరుకున్న ఈయనకు దేవస్థాన కమిటీ సభ్యులు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. దేవస్థానం ఆవరణంలోకి రాగానే ఆలయ ప్రధాన అర్చకులు వెల్ది -శివసాయి కుమార్ శర్మ వరివట్టం కట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోత్రనామార్చన చేసి అమ్మవారి తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం శ్రీకనకదుర్గమ్మ చిత్రపటాన్ని కమిటీసభ్యుల చేతులమీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా బలరాంనాయక్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు బాధ్యత నిర్వహించేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలియజేశారు. అనంతరం ఆయన చేతులమీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షుడు అజ్మీరా రాంజీనాయక్, అధ్యక్షుడు పప్పు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు సిలివేరు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సిలివేరు వీరాంజనేయులు, సహాయ కార్యదర్శి నాగులంచ రమేష్, కార్యవర్గ సభ్యులు భూక్య రమేష్, కర్రి జగన్నాధరావు, పాలిన రమేష్, కానూరి మోహన్రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికి మంచి జరగాలి

**పాల్వంచ, ఏప్రిల్ 08, ప్రజాజ్యోతి:**



తెలుగు సంవత్సరాధి ఉగాది క్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరికి మాంచి జరగాలని డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాస రావు అన్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడిలోని తీపి, చేదు లాగానే జీవితం రంగులమయమన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవనం సాగించాలన్నారు. తెలంగాణా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రజలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అనుభవించాలని కొత్వాల అన్నారు.

**- డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల**

## జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు: ఎమ్మెల్యే కూనంనేని

**పాల్వంచ, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:**



జిల్లా ప్రజలకు, అధికార యంత్రంగానికి, ఉద్యోగులకు, కార్మిక వర్గానికి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలోకి అడుగెడుతున్న తెలుగు ప్రజలు కొత్త ఏడాదిలో ప్రజలకు ఎలాంటి కస్టాలు రాకుండా సుఖ సంతోషాలతో గడపాలని, ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేరాలి ఆకాంక్షించారు. విద్యార్థులు, యువకులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఈ లక్ష్యాల సాధనకు శ్రమించాలని సూచించారు.

## ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

**ఇల్లందు, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:**



ఇల్లందు నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే, ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వ్యవసాయ రంగంగా పరిగణించే ఈ పండుగ రైతన్న జీవితంలో సుఖసంతోషాలతో జీవిస్తూ, పచ్చని పాడిపంటలతో వర్ధిల్లాలని కోరారు. ఇల్లందు నియోజకవర్గ రైతాంగం వర్ధిల్లాలని కోరారు.

# ఉత్తమ గాయనిగా పూజారి జ్యోతి

**మణుగూరు, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి**



ఉగాది పండుగను పురస్కరించుకొని సఖి జాతీయ మహిళా మండలి ఫౌండర్ అండ్ చైర్మన్ నరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు 2024 సాంస్కృతిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం జిల్లా కేంద్రం కొత్తగూడెం లో సాయి ఫంక్షన్ నందు ఘనంగా నిర్వహించారు. సఖి జాతీయ మహిళా మండలి ఆధ్వర్యంలో 150 కుటుంబాలకు చేసిన పలు సేవా,సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న సఖి జాతీయ మహిళా మండలి సభ్యులకు ఉత్తమ సాంస్కృతిక సేవా పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. ఉగాది పురస్కారాలు 2024 సాంస్కృతిక సేవా పురస్కారాలలో ఉత్తమ గాయనిగా మణుగూరు కి చెందిన పూజారి జ్యోతి (నేషనల్ సెక్రెటరీ) కి సాంస్కృతిక సేవా పురస్కారం, మెమెంటో తో ఘనంగా సత్కరించారు. సేవా కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా కార్యక్రమాలలో గాయనిగా యాంకర్ గా కార్యక్రమాలను విజయవంతం చేయడం లో తనవంతు సహాయ సహకారాలు అందించినందుకు గాను ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సఖి జాతీయ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ ఉగాది పురస్కారం రావడం పట్ల గాయని, సఖి జాతీయ మహిళా మండలి నేషనల్ సెక్రెటరీ పూజారి జ్యోతి హర్షం వ్యక్తం చేశారు.

# నవమి ఉత్సవాలకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి

**భద్రాచలం, 8 ఏప్రిల్, ప్రజాజ్యోతి:**



ఏప్రిల్ 17, 18వ తేదీలలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం,మహా పట్టాభిషేక మహోత్సవాలకు దేశం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి స్వచ్ఛంద సంస్థలు అధికారులతో సహకరించాలని భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు అన్నారు. సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఆర్డిఓ ఛాంబర్ లో భద్రాచలంలో స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో భక్తులకు కల్పించవలసిన వసతి సౌకర్యాల గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా స్వామివారి కళ్యాణం తిలకించడానికి తప్పకుండా కుటుంబ సభ్యులతో వస్తారని అందుకు ఆర్డబ్ల్యూఎస్ మరియు మిషన్ భగీరథ అధికారులు స్వచ్ఛమైన మంచినీరు మజ్జిగ పాకెట్లు సరఫరా చేస్తున్నారని, స్వచ్ఛంద సంస్థలు అధికారులకు సహకరించి వారి సంస్థ సభ్యుల ద్వారా వాటర్ పాకెట్లు మజ్జిగ పాకెట్లు భక్తులందరికీ అందే విధంగా చూడాలని, ఏ ఒక్క భక్తుడూ అసౌకర్యాన్ని గురికాకుండా చూడవలసిన బాధ్యత అందరి పైన ఉన్నందున ఎక్కువ శాతం స్వచ్ఛంద సంస్థల ద్వారా వాలంటీర్స్ ని నియమించి అందరికీ మంచినీరు మజ్జిగ ప్యాకెట్లు అందించాలని ఆయన అన్నారు. భక్తులు కళ్యాణం తిలకించేటప్పుడు తప్పనిసరిగా సెక్టార్లలో కూడా మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందేలా సంబంధిత స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చొరవ చూపాలని అన్నారు. మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు సరఫరా చేసే వాలంటీర్లకు ప్రతి సెక్టార్ కు వెళ్లడానికి గుర్తింపు కార్డులు అందిస్తామని దానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ భక్తులకు మన ఇంటి మనుషులుగా భావించి సహకరించాలని అన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు వైద్య సౌకర్యం మరియు ప్రతి సమాచారం అందించడానికి ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపులు సమాచార కేంద్రాలకు సంబంధించిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, మిషన్ భగీరథ డి ఈ శ్రీనివాస్, తాసిల్దార్ శ్రీనివాస్, హెచ్ ఈ ఓ దుర్గయ్య, జిపిఈఓ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, విజయలక్ష్మి, దామోదర్ రావు, రాజారెడ్డి, పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలపై చీటింగ్ కేసులు నమోదు



**కొత్తగూడెం క్రైమ్, ఏప్రిల్ 08, ప్రజాజ్యోతి:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ సూచనలతో జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేసి అట్టి వాహనదారులపై చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై నరేష్ తెలియజేసారు. కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్ లో నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగూడెం వన్ టౌన్, టూటౌన్, 3టౌన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను నడుపుతూ పట్టుబడిన వారిపై చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్ లకు పాల్పడే నేరస్తులు నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను ఉపయోగిస్తున్నారని, అట్టి నేరాల నియం త్రణ, చేధన కొరకు ఈ విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. కొత్తగూడెం పట్టణంలో నెంబర్ ప్లేట్లు లేకుండా గానీ,నెంబర్ ప్లేట్లు టాంపర్ చేసి గానీ ఎవరైనా పట్టుబడితే వారిపై చీటింగ్ కేసులను నమోదు చేయడం జరుగు తుందని హెచ్చరించారు. నేరాల నియంత్రణకు పోలీసు వారు చేపడుతున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కావున ప్రజలంతా తమ వాహనాలకు నెంబర్ ప్లేట్లు సరైన పద్ధతిలో కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సుజాతనగర్ ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకున్న సీపీఐ

### - ఎంపీపీగా భూక్యా పద్మావతి



**కొత్తగూడెం క్రైమ్, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:**

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్ష స్థానాన్ని సిపిఐ కైవసం చేసుకుంది. గతంలో ఎంపిపిపై సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాసం ఆమోదంపొందడంతో అధికారులు సోమవారం నూతన అధ్యక్ష ఎన్నికకు ఎన్నికలు నిర్వహించారు. ఎనిమిది మంది సభ్యులకుగాను ఏడుగురు సభ్యులు సమావేశానికి హాజరుకాగా సభ్యులందరు సిపిఐ అభ్యర్థికి మద్దతుపలికారు.

దీంతో సిపిఐకి చెందిన సీతంపేట బంజర ప్రాదేశిక నియోజకవర్గ సభ్యురాలు భూక్య పద్మావతి ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల ప్రజా పరిషత్ అధ్యక్ష స్థానం సిపిఐ కైవసం చేసుకోవడంతో సోమవారం సిపిఐ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. నూతన ఎంపిపిగా ఎన్నికైన భూక్యా పద్మావతిని సీపీఐ సుజాతనగర్ మండల కార్యాలయంలో కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అభినందించారు. పార్టీ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సుజాతనగర్ మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఎంపిపి పదవి దోహదపడుతుందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీల ప్రజాప్రతినిధులు నిత్యం అందుబాటులో ఉంటారని, ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వందరోజుల వ్యవధిలోనే అనేక ప్రజా సమస్యలు పరిష్కరించగలిగామని, కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనజీలు, ఇతర అభివృద్ధి పనుల పూర్తిచేశామన్నారు.

సుజాతనగర్ మండలంపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. నూతన ఎంపిపి పద్మావతి మాట్లాడుతూ ఎమ్మెల్యే కూనంనేని సహకారంతో పెద్దమొత్తంలో అభివృద్ధినిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఏస్ కె సాబీర్ పాషా, పార్టీ జిల్లా, మండల సమితి సభ్యులకు, తనను ప్రతిపాదించిన సహా ఎంపిటీసీలకు, మిత్రపక్షాల నాయకులకేజ్ పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు. అభినందనలు తెలిపినవారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గారాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస, జిల్లా సమితి సభ్యులు భూక్య దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె జమలయ్య, వి. పూర్ణచందర్ రావు, భూక్య శ్రీనివాస్, ఎం ధనలక్ష్మి, నాయకులు తాళ్ల వెంకటేశ్వర రావు, భాగం శేషభూషణం, బండి రమేష్, కోమారి కృష్ణ, మురళి, మల్లేష్, వీర్ల దుర్గాప్రసాద్, భాగం కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.